సాక్షి ఒడిశా

శుక్రవారం । 3 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,66,394లు, బంగారం 14 గ్రాముల 650 మిల్లీగ్రాములు, వెండి 85 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సవాలు పునఃప్రారంభం

చైతీ ఉత్సవాలు పునఃప్రారంభమయ్యాయి. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో



జోరుగా కొనుగోలు

ధాన్యం కొనుగోలు జోరుగా జరుగుతోంది. మద్దతు ధర అందుతోంది.

- 8లో

దట్టంగా పొగమంచు







గజపతి, కంధమాల్ జిల్లాల్లో పొగమంచు దట్టంగా కమ్ముకుంది. జాతీయ రహదారి 326ఎపై రాకపోకలు కష్టమవుతున్నాయి. అనేక భారీ ట్రక్కులు ఉదయం లైట్లు వేసుకుని పట్టణంలోకి అడుగుపెడుతున్నాయి. జనవరి 5 వరకూ రాష్ట్రంలో పలు జిల్లాల్లో పొగమంచు ఉండే అవకాశం ఉంది. తర్వాత చలి తగ్గుతుందని వాతావరణ శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ శరత్ చంద్ర సాహు (భువనేశ్వర్) తెలియజేశారు.

పర్లాకిమిడి

న్యూస్‌రీల్

బైక్ పెట్రోలింగ్ ప్రారంభం



మంజూరైన పెట్రోలింగ్ బైక్‌లు

రాయగడ: నగరంలో వరుసగా దొంగతనాలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లు పెరిగిపోవడంతో వాటిని నియంత్రించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విరివిగా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టింది. ఇందుకుగానూ 8 బైకులు మంజూరయ్యాయి. పోలీస్ హారన్ సౌండ్‌లతో అమర్చబడిన ఈ బైకులతో ఇకపై ప్రతిరోజూ పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేపడతారు. ప్రతీ బైకుపై ఇద్దరు పోలీసులు ఉంటూ పెట్రోలింగ్ నిర్వహిస్తారు. పట్టణాన్ని 8 విభాగాలుగా విభజించిన పోలీస్ యంత్రాంగం ప్రతీ విభాగానికి ఒకొక్క బైకును కేటాయించింది. ప్రతీ బైకుపై ఆయా ప్రాంతాల్లో సాయంత్రం నుంచి ఉదయం వరకు పెట్రోలింగ్ కొనసాగిస్తారు. ప్రజలను సురక్షితంగా ఉంచడంతో పాటు వారికి తగిన భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో ఈ తరహా చర్యలను చేపట్టడం జరిగిందని సమాచారం.

పుష్‌పుణి మహోత్సవంలో ఫిల్మ్ ఫెస్టివల్



సమావేశంలో పాల్గొన్న పుష్‌పుణి కమిటీ, ఫిల్మ్ డెవలపమెంట్ సొసైటీ సభ్యులు

జయపురం: జయపురంలో ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న పుష్‌పుణి మహోత్సవాల్లో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ప్రతి రోజూ రెండు లేదా మూడు సినిమాలు ప్రదర్శించనున్నారు. స్థానికంగా గల ఓ కల్యాణ మండపంలో గురువారం సమావేశమైన పుష్‌పుణి మహోత్సవ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఫిల్మ్ ఫెస్టివల్‌ను కొరాపుట్ ఫిల్మ్ డవలప్‌మెంట్ సొసైటీ(కె.ఎఫ్.డి.ఎస్) నిర్వహించ నున్నట్టు సమావేశంలో వెల్లడించారు. కొరాపుట్ జిల్లాలో ఇది ప్రథమ ఫిల్మ్ ఫెస్టివల్ కానుందని కేఎఫ్‌డీఎస్ అధ్యక్షుడు రాజేంద్ర సాహు వెల్లడించారు. జయపురం లో 8 దినాలు జరగనున్న పుష్‌పుణి మహోత్సవాల నిర్వహణపై మరోసారి సమావేశమవుతామన్నారు. పుష్‌పుణి మహోత్సవాల్లో ప్రదర్శించేందుకు వచ్చే సినిమాలు 10వ తేదీలోగా ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు.

అక్రమంగా విదేశీ మద్యం విక్రయం



కిరాణా షాపులో మద్యం విక్రయిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బేజాంగ్‌వాడ పంచాయతీలో ఒక కిరాణా వ్యాపారి తన ఇంట్లో లైసెన్స్ లేకుండా విదేశీ మద్యం ఉంచి స్థానికులకు అమ్ముతున్నాడు. ఈ విషయం తెలిసిన కొంతమంది జిల్లా కేంద్రం నుంచి సైతం అతడి వద్ద కొనుగోలు చేసేందుకు వెళ్తున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారి బింబాధర్ పండాను వివరణ కోరగా ఘటనపై దర్యాప్తు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



సూర్యనారాయణ శర్మకు బాధ్యతలు అప్పగిస్తున్న జయరాం, డాక్టర్ సురేష్

రాయగడ: స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బుధవారం క్లబ్ రీజనల్ కో ఆర్డినేటర్ టి.జయరాం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గాన్ని ప్రకటించారు. క్లబ్ అధ్యక్షుడిగా కె.సూర్యనారాయణ శర్మ, కార్యదర్శిగా బాసుదేవ్, కోశాధికారిగా దేవరాజ్ పండా, ఉపాధ్యక్షుడిగా జయకృష్ణ ప్రదాన్, సలహాదారులుగా దేవరాజ్ పండా, సుభాస్ బెహరా, డాక్టర్ ఎం.సురేష్ కుమార్, జాలీ వాకర్‌గా ఎస్.త్రినాథరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన అధ్యక్షుడు సూర్యనారాయణ శర్మకు కో ఆర్డినేటర్ జయరాం బాధ్యతలను అప్పగించారు.

కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం నేడు



కొత్త గవర్నర్‌కు గౌరవ వందనం సమర్పించిన పోలీసు అధికారి



కొత్త గవర్నర్‌కు స్వాగతం పలికిన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర కొత్త గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం ఆయన రాష్ట్రానికి చేరుకున్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్త గవర్నర్‌కు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర శాసన సభ స్పీకరు సురమా పాఢి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా డాక్టరు హరిబాబు కంభంపాటికి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక విమానాశ్రయంలో గౌరవ స్వాగతం (గార్డు ఆఫ్ ఆనరు) పలికారు. గురువారం రాత్రి పూరీ రాజ్ భవన్‌లో విశ్రమిస్తారు. ఉదయం పూరీ శ్రీ జగన్నాథుని దర్శించుకుని శుక్రవారం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా సతీసమేతంగా శ్రీక్షేత్రం సందర్శిస్తారు. అనంతరం స్థానిక రాజ్ భవన్‌కు చేరి ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయన 27వ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

రాష్ట్రంలో అడుగు పెట్టిన కొత్త గవర్నర్ మాట్లాడుతు ఆత్మకు స్ఫూర్తినిచ్చేలా దైవత్వం, భక్తి కలగజేసే పవిత్ర భూమి ఒడిశాలో అడుగు పెట్టడం తన అదృష్టమని అన్నారు. మిజోరాం ప్రజల భావోద్వేగ వీడ్కోలు చిరస్మరణీయమని కొనియాడారు.



కొత్త గవర్నర్‌కు స్వాగతం పలికిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్



మిజోరాంలో వీడ్కోలు అందుకున్న డాక్టరు హరిబాబు కంభంపాటి



కొత్త గవర్నర్‌కు స్వాగతం పలికిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా

ఆదివాసీ జాతర-2025కు సన్నాహాలు



రూపు దిద్దుకుంటున్న ఆదివాసీ గ్రామం.



దళిత సంప్రదాయ అలంకరణ



జాతర సన్నాహాల్లో గిరిజనులు.

భువనేశ్వర్: రాష్ట్ర స్థాయి ఆదివాసీ జాతర-2025 ప్రారంభం కానుంది. ఈ మేరకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ నెలలో ప్రవాస భారతీయ దినోత్సవం రాష్ట్రంలో తొలి సారిగా జరుగుతున్న నేపథ్యంలో ఆదివాసీ జాతర ప్రాధాన్యత సంతరించుకుంది. రాజధాని నగరంలోనే ఆదివాసీ జాతర ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక యూనిట్ 3 ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాష్ట్ర షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి, బలహీన వర్గాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఈ నెల 5 నుంచి 16 వరకు ఆదివాసీ జాతరను నిర్వహిస్తుంది. ఈ ఏడాది జాతరలో దళిత గ్రామాలు, ఆదివాసీ గుడిసెలు, దళిత కళలు, హస్తకళల గ్రామాలు, ఆదివాసీ ఆహార ప్రాంగణాలు, దళిత సంప్రదాయాల ప్రత్యక్ష ప్రదర్శన, భగవాన్ బిర్సా ముండా పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి. ఈ ఏడాది 20 గిరిజన గుడిసెలు నిర్మించి 147 గిరిజన ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఆదివాసీ కళలు, కళాత్మక ఉత్పాదనలతో 40 స్టాళ్లను సిద్ధం చేస్తున్నారు, 15 స్టాళ్లలో ప్రత్యక్ష ప్రదర్శన సౌకర్యం ఉంటుంది. బిర్సా ముండా జీవిత చరిత్రకు సంబంధించిన రాష్ట్ర, దేశ స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర ప్రదర్శన, మినీ థియేటర్ ఫొటో ఎగ్జిబిషన్‌తో 5 గ్యాలరీలతో భగవాన్ బిర్సా ముండా పెవిలియన్ ఏర్పాటవుతుంది. ప్రతి రోజు సాయంత్రం భగవాన్ బిర్సా ముండా జీవితం ఆధారంగా లేజర్ షో, ఒడిశా గిరిజనుల విశేషాలతో కూడిన డ్రోన్ షో, ఒడిశా గిరిజన స్వాతంత్ర్య సమరయోధులపై లైట్ అండ్ సౌండ్ షో, ఫ్యాషన్ షో బాణసంచా వంటి కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆటో.. స్కూటీ ఢీ




బోల్తాపడిన ఆటోను సరిచేస్తున్న దృశ్యం



గాయాలు తగిలిన వారికి చికిత్స చేస్తున్న దృశ్యం

రాయగడ: ఆటో స్కూటీ ఢీకొన్న ఘటనలో పది మంది గాయపడ్డారు. జిల్లాలోని బిసంకటక్‌లో గల మా మార్కమా కళాశాల ఎదురుగా బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో గాయపడిన వారిని బిసంకటక్‌లో గల క్రిస్టియన్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. నూతన ఏడాది సందర్భంగా మా మార్కమా వీధికి చెందిన నలుగురు మహిళలు తమ పిల్లలతో కలిసి ఆటోలో బంకుబడి గ్రామంలోని కెనాల్ వద్దకు పిక్‌నిక్‌కు వెళ్లారు. ఆనందంగా గడిపి తిరిగి వస్తున్న సమయంలో మా మార్కమా కళాశాల ఎదురుగా ఆటో స్కూటీ ఢీకొన్నాయి. ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో కూర్చున్న 8 మంది ప్రయాణికులు గాయపడ్డారు. స్కూటీ నడిపిస్తున్న ఉగ్రసేన్ గౌడోకు కూడా దెబ్బలు తగిలాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

పుష్పార్చన



లక్ష చామంతులతో స్వామివారికి అర్చన

రాయగడ: ధనుర్మాసం పురస్కరించుకొని స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో లక్ష చామంతులతో అర్చన కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారికి విశేష పూజలతో పాటు అభిషేకాలు అర్చన కార్యక్రమాలు జరిగాయి.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



చెట్టుకు ఢీకొని ప్రమాదానికి గురైన ట్రక్కు

జయపురం: నూతన సంవత్సర రాత్రి జయపురం సబ్ డివిజన్‌లో వేర్వేరు ప్రాంతాల్లో రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసు స్టేషన్ పరిధి మహులి గ్రామం సమీపంలో గల శివ మందిరం ఘాట్ రోడ్డులో ఒక ట్రక్కు ప్రమాదానికి గురై ఇద్దరు దుర్మరణం చెందారు. మృతి చెందిన వారి వివరాలు ఇంతవరకు తెలియ లేదని పోలీసు వర్గాలు వెల్లడించాయి. రాత్రి 10 గంటల సమయంలో ఒక ట్రక్కు బొయిపరిగుడ మీదుగా జయపురం వెళ్తోంది. బొయిపరిగుడ పోలీసు స్టేషన్ పరిధిలో మహులి గ్రామ సమీపంలో ట్రక్కు అదుపు తప్పి సమీపంలో ఉన్న శివ మందిరం వద్ద గల ఒక చెట్టుకు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ట్రక్కుకు ఆంధ్ర ప్రదేశ్ రిజిస్ట్రేషన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి దులాగుడ రోడ్డులో రాత్రి రెండు మోటారు బైక్ ఢీకొన్నాయి. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను రక్షించి వారిని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రాథమికి చికిత్స అనంతరం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాలకు తరలించారు.

సాగునీటి వనరులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కద్రక, వేదికపై బాగ్, రైతా తదితరులు

● ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక

రాయగడ: జిల్లాలో ఉన్న అపారమైన సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని రాయగడ శాసనసభ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అన్నారు. స్థానిక రాణిగుడఫారంలోని బిజూ పట్నాయక్ కల్యాణ మండపంలో పాణి పంచాయతీల పక్షోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నాగావళి, వంశధార, జంఝావతి వంటి జీవనదులు ఉన్నప్పటికీ వ్యవసాయ రంగంలో చాలా వెనుకబడి ఉన్నామన్నారు. అత్యధిక శాతం మంది ఆదివాసీలు ఉన్న ఈ జిల్లాలో సుమారు 80 శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వాలు మారినా రైతుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమమే పరమావధిగా చెబుతున్న ప్రస్తుత ప్రభుత్వం, గత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా మించపోయిందేమీ లేదని ఉన్న జలవనరులను సాగునీటి వనరులుగా మార్చగలగాలని సూచించారు.

రైతులకు అవగాహన

వ్యవసాయ రంగంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు పాణి పంచాయతీల ద్వారా వారికి ఆయా రంగాల్లో ఉన్నతికి సంబంధించి ప్రభుత్వం ఇటువంటి తరహా కార్యక్రమాలను నిర్వహిస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా అన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు ఉన్న సాగునీటి వనరులకు అనుగుణంగా వ్యవసాయం చేసుకోవాలన్నారు. అదే విధంగా వ్యవసాయ రంగంలో మెలుకువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో సాగునీరు అందించాలి



ఆర్‌శెట్టి హాల్‌లో జిల్లా స్థాయి సాగునీటి సంఘాల పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దాస్



విద్యార్థిని అనితా ప్రదాన్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పర్లాకిమిడి: సాగునీటి సంఘాల ద్వారా రైతులకు సాగునీరు సకాలంలో నీటిపారుదలశాఖ ఇంజినీర్లు అందించాలని, అవసరమైనచోట మరమత్తులు చేయాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం కాన్ఫరెన్స్ హాల్‌లో సాగునీటి సంఘాల పక్షోత్సవాలను ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ గురువారం ప్రారంభించారు. జలసంపద విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి గౌరవ అతిథులుగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ పీడీ సురేష్ కుమార్ పట్నాయక్, జిల్లా ముఖ్యప్రాణి చికిత్సాధికారి తుషార్ రంజన్ సాహు, డైరెక్టర్ ఉద్యానవనాలశాఖ అధికారి సుశాంత కుమార్ దాస్, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, కాశీనగర్, గుమ్మా సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, సునేమీ మండల్ తదితరులు హాజరయ్యారు. కాశీనగర్, గుసాని సమితుల్లో సాగునీటి సంఘాల అధ్యక్షులు ఎవరున్నారో తెలియజేయడం లేదని గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు ఆరోపించారు. సాగునీటి సంఘాల ద్వారా ఎత్తిపోతల పాయింట్లు, తుప్పలు, కాలువల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చైర్మన్ వీర్రాజు ఆరోపించారు. రైతులు, ఇంజినీర్లు, సాగునీటి సంఘాలు కలిసి పాణిపంచాయతీల పునరుద్ధరణకు అడుగు ముందుకు వేయాలని సలహా ఇచ్చారు. గజపతి జిల్లా వ్యాప్తంగా 1995లో సాగునీటి సంఘాలు ఏర్పడగా, చిన్ననీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 148, బృహత్తర ఎత్తిపోతల శాఖ ఆధ్వర్యంలో 457, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 386 పాణి పంచాయతీలు పనిచేస్తున్నాయని నీటి పారుదలశాఖ ఇంజినీర్లు అన్నారు. పట్టణంలో సాగునీటి సంఘాలపై రచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

అశోక్ మిశ్రాకు ఘన నివాళులు



అశోక్ మిశ్రా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

జయపురం: జయపురంలో సీనియర్ బీజేపీ నేత, ప్రముఖ వ్యాపారి, న్యాయవాది స్వర్గీయ అశోక్ మిశ్రా అకాల మృతికి జిల్లా బార్ అసోసియేషన్ ఘన నివాళులు అర్పించింది. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో గల బార్ అసోసియేషన్ సభాగృహంలో నిర్వహించిన సంతాప సభలో మిశ్రా చిత్ర పటానికి నివాళులర్పించారు. మిశ్రా న్యాయవాదిగా పేరుగాంచిన వ్యక్తి అని, ఆయన లేని లోటు తీర్చలేనిదని పలువురు న్యాయవాదులు అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సింగ్‌లాల్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సభ్యులు రాజేంద్ర కుమార్ గౌడ, సుధీర్ త్రిపాఠీ, గిరిధర భోర, శౌశా మిశ్రా, రమేష్ పాత్రో, మదన మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రాస్తారోకో



ధాన్యం బస్తాలతో రోడ్డెక్కిన రైతులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి నాయక్‌గూఢ గ్రామంలో ఏర్పాటు చేసిన మండీలో సరైన ధర ఇవ్వడం లేదని గురువారం రైతులు రాస్తారోకో చేశారు. ఇక్కడ నిర్దేశించిన లక్ష్యం పూర్తయ్యాక కొనుగోలు చేయడం లేదని, తమ గోడు ఎవరి వద్ద వెళ్లబుచ్చుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ దుర్యోధన బోయి సంఘటన స్థలానికి వెళ్లి రైతులకు నచ్చజెప్పారు. రైతుల ధర్నాతో నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

టెక్కలి రూరల్: స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ సమీపంలో అయ్యప్పనగర్‌కు వెళ్లే దారిలో గురువారం దుంపల గొడౌన్‌కు అన్‌లోడ్ చేసేందుకు వచ్చిన లారీ వెనుక్కు వస్తూ అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఒక్కసారిగా స్తంభం రెండు ముక్కలు కావడంతో విద్యుత్ వైర్లు కిందకు వాలిపోయాయి. ఆ సమయంలో కింద ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది వెంటనే మరమ్మతులు చేయించారు.

బడ్డీ దగ్ధం



కాలిపోతున్న బడ్డీ

టెక్కలి రూరల్: స్థానిక పాత జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకు సమీపంలో పాడుబడిన ఖాళీ బడ్డీలో గురువారం ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయని స్థానికులు చెబుతున్నారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ

సోంపేట: మండలంలోని బారువ, లక్కవరం, పలాసపురం, కొర్లాం పంచాయతీల పరిధిలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పలాస ఆర్డీఓ జి.వెంకటేష్ గురువారం స్థల పరిశీలన చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురం గ్రామానికి చెందిన పైడి వరహాలమ్మ (66) బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల తో బుధవారం మధ్యాహ్నం వర కు గడిపిన వరహాలమ్మ రాత్రి కనిపించకపోవటంతో కుమారు లు చంద్రరావు, అమ్మినాయుడు, మురళీ చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. గురువారం ఉదయం సైతం ఆచూకీ కోసం ప్రయత్నించారు. కుశాలపురంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బావిలో మృతదే హం తేలడంతో స్థానికులు గుర్తించారు. ఆ మృతదేహం తమ తల్లిదేనని కుమారుడు చంద్రరా వు గుర్తించి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో సివిల్ భూ వివాదం కారణంగా తన తల్లి బలవన్మరణానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

చైతీ ఉత్సవాలు పునఃప్రారంభం



ఒడిస్సీ నృత్యం



మునిగుడకు చెందిన ఘుమురా నృత్యం

రాయగడ:

చైతీ ఉత్సవాలు పునఃప్రారంభమయ్యాయి. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో గత ఏడాది డిసెంబర్ 26న ప్రారంభమైన ఉత్సవాలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయి. తిరిగి ఈ ఉత్సవాలను జిల్లా యంత్రాంగం గురువారం నుంచి ప్రారంభించింది. ఈ నెల 4 వ తేది వరకు కొనసాగుతాయి. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా హాజరయ్యారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో అధిక శాతం మంది లంజియా సవర, డొంగిరియా, బొండా వంటి ఆదిమ జనజాతి తెగకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని, వారి సంప్రదాయాలను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, జిల్లాలోని అన్ని సమితులకు చెందిన అధ్యక్షులు , ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన పలువురికి సన్మానం చేసి జ్ఞాపికలను అందించారు.



సంబల్‌పూరి నృత్యం



ఉత్సవాలు తిలకించేందుకు వచ్చిన జనం



జ్ఞాపికను ఇచ్చి సన్మానిస్తున్న జిల్లా అదనపు కలక్టర్ రైతా, ఖెముండొ



ఆదివాసీ సంప్రదాయ నృత్యం

రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల బదిలీలు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన శాఖల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

- గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్‌బీఎస్ రాజ్‌పుత్ ప్రభుత్వ రంగ సంస్థల విభాగం ప్రిన్సిపల్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.
- ఇపికాల్ మేనేజింగ్ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహిస్తున్న భూపిందర్ సింగ్ పుణియాకు పరిశ్రమల విభాగం ప్రత్యేక కార్యదర్శి, ఇడ్కో మేనేజింగు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు.
- వ్యవసాయం, వ్యవసాయ ఉత్పాదన విభాగం డైరెక్టర్‌గా, ఒడిశా ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషను లిమిటెడ్ మేనేజింగు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న 2010 సంవత్సరపు ఐఏఎస్ బ్యాచ్ అభ్యర్థి ప్రేమ చంద్ర చౌదరికి జౌళి, చేనేత విభాగం డైరెక్టరుగా అదనపు బాధ్యతలు కేటాయించారు.
- ప్రభుత్వ రంగ సంస్థల కమిషనర్, కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తెమ్‌జెన్ వపాంగ్ ఏఓ ప్రణాళిక విభాగం ప్రత్యేక కార్యదర్శిగా నియమితులయ్యారు.

ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి బదిలీ

ముఖ్యమంత్రి ప్రైవేటు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2011 సెంవత్సరపు ఐఏఎస్ బ్యాచ్ అభ్యర్థి అరిందమ్ డకువా బదిలీ అయ్యారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఆయన మునిసిపల్ పాలన విభాగం డైరెక్టరు గృహ నిర్మాణం, నగర అభివృద్ధి విభాగం ఎక్స్ అఫీషియో అదనపు కార్యదర్శిగా నియమితులు అయ్యారు. ఈ ఏడాది జూలైలో అరిందమ్ డకువా ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శిగా నియమితులయ్యారు. స్వల్ప నిడివిలో ఆయనకు బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఆయన స్థానంలో ఎవరిని భర్తీ చేస్తారనే దానిపైనే అందరి దృష్టి ఉంది.

లారీ క్లీనర్ మృత్యువాత



మృతి చెందిన జుబీర్ అన్సారీ

రణస్థలం: మండలంలో ని పైడిభీమవరం సమీపంలో వరిసాం వద్ద లారీ క్లీనర్ జుబీర్ అన్సా రీ (23) అకస్మాత్తుగా కుప్పకూలి చనిపోయాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరియర్ ట్రాన్స్‌పోర్టు లారీ జంషెడ్‌పూర్ నుంచి బెంగళూరు బయలుదేరింది. గురువారం వేకువజామున 3 గంటల సమయంలో డ్రైవర్ శ్యాం సుందర్, క్లీనర్ జుబీ ర్ అన్సారీ వరిసాం వద్ద సాహు దాబా వద్ద లారీ ఆపి టీ తాగేందుకు లోపలకు వెళ్లారు. అరగంట తరువాత క్లీనర్ లారీ డ్రైవ్ చేసేందు కు స్టీరింగ్ ముందు కూర్చొన్నాడు. వెనువెంటనే స్టీరింగ్‌పై కుప్ప కూలి మృతి చెందాడు. ఇతను ఆరోగ్యంతో బాధపడుతూ మందులు కూడా వాడుతున్నా రు. మృతుడు జార్కండ్ రాష్ట్రం చత్ర జిల్లాకు చెందినవాడు. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు శవపంచనామాకు తరలించారు. ఎస్సై ఎస్ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడో రోజు 214 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు గురువారం కూడా కొనసాగాయి. మూడో రోజు పరీక్షలకు 613 మందికి గాను 339 మంది హాజరు కాగా 214 మంది తుది రాత పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 18 వరకు ఎంపిక పరీక్షలు కొనసాగనున్నాయి.

వృద్ధుల ఆనందం కోసం..



ఊయల ఊగుతున్న వృద్ధులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితిలో స్థానికంగా ఉన్న గిరిజనులకు నూతన సంవత్సర వేడుకలంటే ఏంటో తెలీవు. ఇక్కడి వృద్ధుల ఆనందం కోసం మత్తిలి పంచాయితీ అధికారి ఆశోక్ కుమార్ మాహరణ ఆదివారం తన సొంత ఖర్చులతో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం చక్కటి భోజనాలు ఏర్పాటు చేసి వృద్ధులను సంతోషపరిచారు.



వృద్ధులతో ధింసా నృత్యం చేస్తున్న మత్తిలి పీఈఓ ఆశోక్ కుమార్ మహరణ



టోపీలు పెట్టుకుని డ్యాన్స్‌లు చేస్తున్న గిరిజన వృద్ధ మహిళాలు



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న పీఈఓ అశోక్ కుమార్

5న హైందవ శంఖారావం

రణస్థలం: విజయవాడలో ఈ నెల 5న జరిగే హైందవ శంఖారావం సభకు హిందువులంతా తరలిరావాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు రణస్థలం మండలం కోష్ట గ్రామంలో గురువారం కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణకు హిందువులంతా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి బి.చిన్నంనాయుడు, ఆపస్ అధ్యక్షుడు జి. చిన్ని కృష్ణంనాయుడు, హైందవ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న ధాన్యం కొనుగోలు



మండీల్లో కొనుగోలు చేసిన ధాన్యం



ట్రక్కులతో మండీలకు వచ్చిన ధాన్యం

జయపురం: జయపురం సబ్ డివిజన్‌లోని జయపురం, బొరిగుమ్మ, కొట్‌పాడ్, కుంద్ర, బొయిపరిగుడ సమితుల్లో ఏర్పాటు చేసిన మండీల్లో ధాన్యం కొనుగోలు జోరుగా సాగుతుంది. 5 సమితుల్లో ఏర్పాటు చేసిన 83 మండీల్లో 7 లేంప్‌లు, 24 మహిళా స్వయం సహాయక గ్రూప్‌లు, 3 పాణి పంచాయతీలు ధాన్యం కొనుగోలు చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం వరకు 83 మండీల్లో 11 వేల 557 మంది రైతుల నుంచి 5 లక్షల 97 వేల, 59 క్వింటాళ్ల 62 కేజీల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అకాల వర్షాల వలన కుంద్ర, బొరిగుమ్మ, కోట్‌పాడ్ జయపురం సమితుల్లో గల కొన్ని సంతలలో క్వింటా ధాన్యంతో మరో 3, 4 కేజీలు అదనంగా తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు ధాన్యాన్ని మండీలకు తీసుకు వస్తుండగా ఎఫ్ఏ క్యూ నాణ్యత లేదని, కొంతమంది రైతుల నుంచి ఖరీదు చేయకుండా వెనక్కు పంపుతున్నారని, వాహనాల అద్దెలు, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులు రైతులు భరించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ నియామకాల ప్రకారం ధాన్యం కొనాలని కొంతమంది రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్కేటింగ్ పోటీల్లో పలాస విద్యార్థుల ప్రతిభ



స్కేటింగ్ విజేతలను అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణారావు

కాశీబుగ్గ: చిత్తూరు జిల్లా తిరుపతిలో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీల్లో పలాస–కాశీబుగ్గ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రిలే రేస్‌లో పి.రాఘవి స్వర్ణ పతకం, 200 మీటర్ల పోటీలో ఎ.అయాన్ రజతం, 1000, 200 మీటర్ల పోటీలో ఎస్.పార్థసాయి బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే సెలెక్టెడ్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. క్రీడాకారులను పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బోర కృష్ణారావు, ప్రిన్సిపాల్ బోర శిరీష, ఉపాధ్యాయులు గురవారం అభినందించారు.

రైల్వేటూరిజంలో ప్రత్యేక ప్యాకేజీలు

ఆమదాలవలస: టూరిజంలో రైల్వేశాఖ ప్రత్యేక ప్యాకేజీలు కల్పిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ వద్ద ప్రకటన విడుదల చేశారు. జనవరి 24 నుంచి 30 వరకు(ఆరు రాత్రులు, ఏడు పగలు) కేరళ రాష్ట్రంలోని కొచ్చి, డచ్ ప్యాలెస్, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి, సాంటర్ క్రాస్ బాసిలిక, మున్నార్, కొమరం, అలీఫ్, తెక్కడి పెరియర్ వన్యప్రాణుల అభయారణ్యం, త్రివేంద్రం పద్మనాభ స్వామి ఆలయం, అజీమల ఆలయం, కోవలం బీచ్ తదితర సుందర ప్రదేశాలు తిలకించవచ్చని, ఒక మనిషికి రూ.64,520, ఇద్దరూ అంతకంటే ఎక్కువ మందైతే చార్జీ తగ్గు తుందని వివరించారు. బయలుదేరినప్పటి నుంచి తిరిగి వచ్చే వరకు మొత్తం ఖర్చు టూరిజం శాఖ భరిస్తుందని తెలిపారు. ఫిబ్రవరి 12 నుంచి18 వర కు మ్యాజికల్ మేఘాలయ(ఆరు రాత్రులు, ఏడు పగలు) పేరిట మేఘాలయ, గౌహతి కామాఖ్య టెంపుల్, బాలాజీ టెంపుల్, చిరపుంజి జలపాతం, గుహలో, ఎలిఫెంటా జలపాతం, లివింగ్ రూట్ బిజీ డాకి సరస్సు, నేషనల్ పార్కు తదితర ప్రదేశా లను చూపిస్తామని వివరించారు. ఎయిర్ ప్యాకే జ్ విశాఖపట్నం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఏడు రోజుల టూర్‌కు రూ.63,635 చార్జీగా నిర్ణయించామన్నారు. పూర్తి వివరాలకు చందన్ కుమార్ (928103074, 9550166168, 9281495847)ను సంప్రదించాలని కోరారు

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగేనా?

- బకాయిలు రూ.75 కోట్ల పైమాటే...
- ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారుతున్న వైనం
- ఆందోళన దిశగా ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు
- ఈ నెల 6 నుంచి సేవల బంద్‌కు సమాయత్తం



జిల్లా కేంద్రంలో ఓ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు

అరసవల్లి:

పేదల ఆరోగ్య సంజీవని ఆరోగ్యశ్రీ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పేదలకు ఉచిత వైద్యం అందించే లక్ష్యంగా ఎలాంటి ఆర్థిక భారం లేకుండా శస్త్రచికిత్సలు చేసేందుకు ఉద్దేశించిన ఈ పథకం..ఇప్పుడు నీరుగారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఎంతో ప్రయోజనాత్మంగా అమలైన సంగతి విదితమే. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీగా పేరు మార్చినా నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పేదల వైద్యంపై టార్గెట్ చేసి ఇప్పుడు ఏకంగా ఉచిత వైద్య పథకానికి గండి కొట్టేలా చర్యలకు ఉపక్రమించారు. గత ప్రభుత్వంలో ఉన్న కొద్దిపాటి బకాయిలతో పాటు తాజా ప్రభుత్వంలో కూడా కోట్లాది రూపాయల బకాయిలు ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించకపోవడంతో ఆయా యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలకు బంద్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

బకాయిలు చెల్లించేదెన్నడో?

జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పేరిట పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేసేందుకు మొత్తం 17 ప్రభుత్వ, 13 ప్రైవేటు ఆసుపత్రులను నెట్‌వర్క్ ఆసుపత్రులను గుర్తించారు. ఆరోగ్యశ్రీ పేరిట రోగులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేసి, ఆయా సంబంధిత ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సిఉంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాం నుంచి ఇదే విధానం అమలౌతూనే ఉంది. గత ప్రభుత్వం వరకు ఆరోగ్యశ్రీలో వందలాది జబ్బులను చేర్చడమే కాకుండా ఎప్పటికప్పుడు ఆయా ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఖర్చుల చెల్లింపులు జరిగేవి. గత ప్రభుత్వం చివర్లో, ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత చెల్లింపులు ఆగిపోయాయి. వీటితో కలిపి ఇప్పటివరకు జిల్లాలో 13 ప్రైవేటు ఆసుపత్రులకు సుమారుగా రూ.75.24 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వాలతో పోల్చితే... కూటమి ప్రభుత్వం వచ్చాకే బకాయిలు ఎక్కువయ్యాయి. దీనిపై పలుమార్లు ప్రైవేటు ఆసుపత్రుల సంఘ ప్రతినిధులు నివేదిస్తున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. దీంతో ఆస్పత్రుల నిర్వహణ ఆయా యాజమాన్యాలకు భారంగా మారింది.

6 తర్వాత సేవల బంద్..!

కోట్లాది రూపాయలు బకాయిలుండడంతో ఆసుపత్రుల యాజమాన్యాలు తీవ్ర ఆందోళనలో ఉండటంతో పాటు ఉద్యమబాట పట్టనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు రూ.3 వేల కోట్ల వరకు బకాయిలు చేరడంతో యాజమాన్యాల పరిస్థితి అయో మయంగా తయారయ్యింది. ఎన్నిసార్లు విన్నవిస్తు న్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 6 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు కూడా జారీ చేసినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే ప్రస్తుతానికి ఆరోగ్యశ్రీ సేవలు ఎక్కడా నిలిపివేయకపోయినప్పటికీ...మరికొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే కచ్చితంగా ఈ నెల 6 నుంచే ఆరోగ్యశ్రీ సేవలన్నీ ప్రైవేటు ఆసుపత్రుల్లో బంద్ కానున్నాయి.

సేవలు కొనసాగుతున్నాయి...



ప్రస్తుతానికి జిల్లాలో 30 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయి. ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయి. మొత్తం 3257 రకాల జబ్బులను ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్నాయి. వీటికి సంబంధించిన రోగులకు ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి.

– డాక్టర్ ప్రకాషరావు, జిల్లా కో–ఆర్డినేటర్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: నూతన సంవత్సరం సందర్భంగా రెవెన్యూ అసోసియేషన్, ఏపీ ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, మున్సిపల్ ఎంప్లాయిస్‌కు చెందిన ఉద్యోగ సంఘాల డైరీని, క్యాలెండర్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, డీజీ ప్రసాదరావు తదితరులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషిచేయాలని సూచించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యోగులంతా సమష్టిగా తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఏపీజేఏసీ అమరావతి, రెవెన్యూ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, జనరల్ సెక్రటరీ డీజీ ప్రసాదరావు, జలవనరుల శాఖ రాష్ట్ర జనర ల్ సెక్రటరీ వి.గౌరునాయుడు, విశ్రాంత ఉద్యోగ సంఘం కార్యదర్శి ఎం.ధనుంజయనాయుడు, ఉపాధ్యక్షుడు డి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం హుండీల ఆదాయం రూ.18.32లక్షలు



రామతీర్థంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న పైడిమాంబ సేవా సంఘం సభ్యులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం అధికారులు గురువారం చేపట్టారు. దేవస్థానం ఆవరణలో నిర్వహించిన హుండీల ఆదాయం లెక్కింపులో రూ.18,32,397 లభించినట్లు ఈఓ వై శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్యామ్‌ప్రసాద్, తనిఖీదారు పద్మావతి హుండీల లెక్కింపును దగ్గరుండి పర్యవేక్షించగా విజయనగరం పైడిమాంబ సేవా సంఘం సభ్యులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో పోలీస్, ఏపీజీవీబీ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కమాండెంట్ మల్లికా గార్గ్



ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమాండెంట్ మల్లికా గార్గ్ తదితరులు

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ పోలీస్ అసోసియేషన్ 2025 ఏడాది నూతన క్యాలెండర్‌ను కమాండెంట్ మల్లికా గార్గ్ గురువారం ఆవిష్కరించారు. బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను పోలీస్ అధికారులు, సిబ్బంది, అసోసియేషన్ ప్రతినిధులు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సత్తిరాజు,అసిస్టెంట్‌లు, అధికారులు,సిబ్బంది, బెటాలియన్ సంఘం అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి మహిళా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ మహిళా పోలీస్‌కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జనవరి 3, 4, 6 తేదీల్లో పీఎంటీ పీఈటీ పరీక్షల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన 3వ రోజు నిర్వహించిన రాత పరీక్షలకు 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 341 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువజామున 5 గంటల నుంచే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో, పరీక్షలు సకాలంలో పూర్తయ్యాయని చెప్పారు. పోలీసు నియామకాల ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత స్వయంగా పర్యవేక్షించారు.

శంబర జాతరకు పక్కాగా ఏర్పాట్లు ఉండాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఈనెల 27,28,29 తేదీలలో నిర్వహించే శంబర జాతరకు పక్కాగా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన శంబర పోలమాంబ జాతరను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని, మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాటుచేసే క్యూలు అత్యంత జాగరూకతతో ఏర్పాటుచేయాలని కోరారు. వైద్యశిబిరాలను, భక్తులు బట్టలు మార్చుకునేందుకు గదులను ఏర్పాట్లు చేయాలన్నారు.

సైన్స్ సంబరానికి వేళాయె..!

- నేడు జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్
- విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించేందుకు చర్యలు
- జిల్లా కేంద్రంలోని డీవీఎం పాఠశాలలో కార్యక్రమం
- 15 మండలాల నుంచి 45 ప్రాజెక్టులు
- ఉత్తమ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక



బలిజిపేట మండల ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ నడుం బిగించింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు రంగం సిద్ధమైంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొనవచ్చు. డిసెంబర్ 31న జిల్లాలో గల 15 మండలాల్లో స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల 45 ప్రాజెక్టులు, జనవరి 3న జిల్లా కేంద్రం డీవీఎం ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు నేరుగా అర్హత సాధించాయని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాల పరిధిలో 1702 పాఠశాలలు ఉండగా వాటిలో 1,18,009 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో 212 ఉన్నత పాఠశాలల్లో 38,724 మంది విద్యార్థులు చదువుతుండగా వారంతా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనకు అర్హులు. వాటితో పాటు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుంచి 50 ప్రాజెక్టులు, వివిధ పాఠశాలల నుంచి 30 మందికి క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలుగా నిలిచిన ప్రాజెక్టులు ఈ నెల 6,7 తేదీల్లో అమరావతిలో రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు.



డీవీఎం ఉన్నత పాఠశాల

పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ

గత నెల 30న ఎంపిక చేసిన పాఠశాలల్లో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. సైన్స్ ప్రాజెక్టుల ఎగ్జిబిషన్‌కు జిల్లా నోడల్ అధికారిగా డి. లక్ష్మణరావు నియామకమయ్యారు. ఈ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఎర్త్/స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్, ఇంజినీరింగ్, బయో సైన్స్ /బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే ఉప అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. మండల స్థాయిలో ఎంపికైనవారు జిల్లాస్థాయిలో జరిగే ప్రదర్శనకు అర్హత సాధించారు. జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు డీవీఎం ఉన్నత పాఠశాల వేదికగా జరగనున్నాయి. జిల్లాస్థాయి కార్యక్రమం డీఈఓ ఎన్ తిరుపతి నాయుడు పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

జ్యూరీ కమిటీకి ప్రాజెక్టు పనితీరును వివరించేలా..

జిలాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలి. జ్యూరీ కమిటీకి ప్రాజెక్టు పనితీరును వివరించగలిగేలా వారిని తీర్చిదిద్దాలి. సైన్స్ ప్రాజెక్టుల సందర్శన పోటీల్లో పాల్గొన్నవారు శాస్త్రీయదక్పథం, సామాజికంగా ప్రయోజనకారంగా ప్రాజెక్టులను తీర్చిదిద్దుకోవాలి. కనీస ప్రమాణాలు కలిగి, ప్రాజెక్టులు నాణ్యమైనవిగా ఉండేవిధంగా తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల తయారీలో థర్మాకోల్ ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని అధికారులు చెబుతున్నారు. థర్మాకోల్‌తో తయారైన నమూనాలను ప్రదర్శనలకు అనుమతించబోమని సైన్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు.

సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి



పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరానికి గాను మండల స్థాయి, జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించాం. నేడు జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయి. హెచ్‌ఎంలు, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. సైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలి.

– ఎన్. తిరుపతి నాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే..



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే మండల స్థాయి పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేశాం. శాస్త్రీయ దక్పథం, సామాజికంగా ప్రయోజనకరంగా ఉండే ప్రాజెక్టుల ను ఎంపిక చేశాం. 15 మండలాల నుంచి 45 ప్రాజెక్టులు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నుంచి 50 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. జిల్లా నుంచి అన్ని ప్రయోజనకరంగా ఉండే ప్రాజెక్టును ఎంపిక చేస్తాం.

– డి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

రాయితీపై సౌర విద్యుత్ యూనిట్లు

- కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: కేంద్రప్రభుత్వం ప్రకటించిన పీఎం.సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత గృహాల్లో రాయితీపై సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నట్లు కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ వెల్లడించారు. ఈ పథకం కింద వచ్చే ఫిబ్రవరిలోగా జిల్లాలోని 51వేల ఎస్సీ, ఎస్టీ గృహాల్లో సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటుచేసే దిశగా డీఆర్‌డీఏ, మెప్మా, మునిసిపల్, విద్యుత్ పంపిణీ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయా వర్గాలకు చెందిన కుటుంబాల్లో సౌరవిద్యుత్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, వారికి ఆదా అయ్యే విద్యుత్ చార్జీల మొత్తం తెలియజేసి యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాస్థాయి పీఎం.సూర్యఘర్ కమిటీ సమావేశం కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌరవిద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.20,000 విద్యుత్ చార్జీల బిల్లును ఆదా చేసుకోవచ్చన్నారు. రెండు కిలోవాట్ల సామర్థ్యం గల యూనిట్ ఏర్పాటుపై పీఎం.సూర్యఘర్ పథకం ద్వారా రూ.60 వేల రాయితీ లభిస్తుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మండల, పట్టణ సమాఖ్యల ద్వారా అవసరమైన మేరకు రుణాలు మంజూరు చేయాలని మెప్మా, డీఆర్‌డీఏ, మునిసిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఆదర్శ గ్రామం ఎంపిక

విజయనగరం రూరల్ పరిధిలో జొన్నవలస, పూసపాటిరేగ పరిధిలో రెల్లివలస, కొత్తవలస పరిధిలో దేశపాత్రునిపాలెం, రాజాం మండలంలో బొద్దాం, గజపతినగరంలో పురిటిపెంట, బొబ్బిలిలో పిరిడి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేశామని ఆ గ్రామాల్లో శతశాతం గృహాల సౌర విద్యుదీకరణ చేసిన గ్రామాన్ని ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్‌ఈ లక్ష్మణరావు, బొబ్బిలి, రాజాం మునిసిపల్ కమిషనర్‌లు, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 4న యువజన ఉత్సవ్ పోటీలు



నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్

పార్వతీపురంటౌన్: జిల్లా యువజన ఉత్సవ్ పోటీలను ఈ నెల 4న నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి సంవత్సరం జనవరి 12న జాతీయ యువజనోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. ఈసారి జిల్లా యువజన ఉత్సవ్ పోటీల కార్యక్రమం జనవరి 4వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిపేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. జిల్లా యువజన ఉత్సవ్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, యువతకు ఆ రోజు ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జానపద నృత్యాలు, జానపద గీతాలు, రకరకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన విజేతలను రాష్ట్రస్థాయిలో జరిగే యువజనోత్సవాలకు పంపనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందితే జనవరి 2025న జరగబోయే జాతీయస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఉత్సాహవంతులైన 15 నుంచి 29 సంవత్సరాల వయసు ఉన్న యువతీయువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారిలో అంతర్లీనంగా ఇమిడిఉన్న కళాప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని కోరారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బహుమతుల వితరణ ఇలా..

ఈ పోటీలకు అనుభవం కలిగిన వారిని న్యాయ నిర్ణేతలుగా ఎంపిక చేశామన్నారు. ఈ పోటీలలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. సైన్స్ మేళా, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రూప్ ఈవెంట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.7 వేలు, ద్వితీయ స్థానికి రూ.5 వేలు, తృతీయ స్థానానికి రూ.3 వేలు, వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానికి రూ.1,500, తృతీయ స్థానానికి రూ.1000, యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్ ఫొటోగ్రఫీ కంటెస్ట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.2,500, ద్వితీయ స్థానానికి రూ.2,000, తృతీయ స్థానానికి రూ.1500 బహుమతిగా అందించనున్నట్లు చెప్పారు. యువ ఉత్సవ్ పోటీలలో పాల్గొన్న అభ్యర్థులందరికీ సర్టిఫికెట్స్ అందిస్తామని ఆ ప్రకటనలో వివరించారు.

ఈనెల 12న యువజన దినోత్సవం

పార్వతీపురం: ఈనెల 12న యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యువజన ఉత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సెట్విజ్, లయన్స్‌క్లబ్, ఐఆర్‌పీడబ్ల్యూఏ, విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్‌లో యువజన దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలోని సృజనాత్మకత వెలికితీసేందుకు యువజన ఉత్సవ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలను బహూకరించడంతో పాటు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల యువత ఈనెల 9లోగా దరఖాస్తులను అందజేయాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 9848418582, 6304637663 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, సెట్విజ్ సీఈఓ రాజ్‌గోపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎస్‌బీరావు, సామాజిక కార్యకర్త శ్రీహరి, ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ డైరెక్టర్ ప్రకాష్, యువజన సభ్యులు గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు దగ్ధం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం
- లబోదిబోమంటున్న రైతు



తెర్లాం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 35 బస్తాల ధాన్యం దగ్ధమయ్యాయి. దీనికి సంబంధించి బాధిత రైతు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం తెర్లాం గ్రామానికి చెందిన రైతు బూరి సత్యం తాను పండించిన వరిచేను బుధవారం సాయంత్రం తోటపల్లి ప్రధాన కుడికాలువ గట్టుపై నూర్పు చేశాడు. వరిచేను నూర్పిన ప్రదేశంలోనే ధాన్యాన్ని 35 గోనె సంచుల్లో నింపి వరిగడ్డి కప్పి నిల్వ చేశాడు. గురువారం ఉదయం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. రాత్రి ఇంటికి భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి అగ్ని ప్రమాదం జరిగింది. ధాన్యం బస్తాలు విద్యుత్ వైర్ల కింద నిల్వ చేయడంతో విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తగిలి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో అగ్గిరవ్వలు వరిగడ్డిపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. ఆరుగాలం కష్టపడి, మదుపులు పెట్టి పండించిన ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయని రైతు సత్యం, అతని భార్య లబోదిబోమంటూ విలపించారు. అగ్ని ప్రమాదంలో ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయని తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే వచ్చి మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాదవార్త తెలిసిన వెంటనే వీఆర్‌వో డి.రాము సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. అగ్ని ప్రమాదం జరిగిన తీరు, నష్టపోయిన ధాన్యం వివరాలను తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు తెలియజేశారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదం, (ఇన్‌సెట్‌లో) దగ్ధమైన ధాన్యం

5న సీనియర్ వాలీబాల్ బాలుర జట్టు ఎంపిక

విజయనగరం: జిల్లా వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లా సీనియర్ బాలుర వాలీబాల్ జట్టు ఎంపిక స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 5 మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కేవీఏఎన్ రాజు(చిన్నారి)గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడాకారులు అందరూ ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు తప్పక హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్రంలో జరిగే వివిధ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నామని పేర్కొన్నారు. సకాలంలో క్రీడాకారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ట్రైబల్ ఇంజినీరింగ్ కళాశాల పరిశీలన

విజయనగరం అర్బన్: కురుపాం ట్రైబల్ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులను జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారుల బృందం గురువారం సందర్శించింది. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ మొదలుపెట్టడానికి గల సాధ్యాసాధ్యాలను పరిశీలించామని ఈ సందర్భంగా వీసీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అకడమిక్ తరగతుల నిర్వహణకు కావాల్సిన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన నిర్మాణ పనులను అంచనా వేశామని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల బృందంలో జేఎన్‌టీయూ జీవీ ప్రొఫెసర్ జి.జయసుమ, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్స్ అండ్ ఓఎస్‌డీ కురుపాం ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ కె.బాబులు, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ రిలేషన్స్ అండ్ వైస్ ప్రిన్సిపాల్ జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.జె.నాగరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ్, యూనివర్సిటీ ఇంజినీర్ పి.వేణుగోపాలరావు, హరిప్రకాశ్‌లు పాల్గొన్నారు.



కురుపాం ట్రైబల్ ఇంజినీరింగ్ కళాశాల పనులను పరిశీలిస్తున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ, ఇంజినీరింగ్ అధికారులు

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

సీతానగరం: మండలంలోని పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులపై గురువారం పిచ్చికుక్క దాడిచేసి గాయపర్చడం వలన క్షతగాత్రులు పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పిచ్చికుక్క ఎక్కడనుంచి వచ్చిందో తెలియదు కానీ తామరఖండి, బళ్లకృష్ణాపురం, బక్కుపేట గ్రామాల మధ్య ఉన్న పొలాల్లో ఎవరి మడులలో వారు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఉన్న సమయంలో వెనుక నుంచి వచ్చి గాయపర్చింది. ఈ నేపథ్యంలో స్థానికులు అందించిన సమాచారం మేరకు పిచ్చికుక్క దాడిలో తామరఖండి గ్రామానికి చెందిన వై శ్రీనివాసరావు, బళ్లకృష్ణాపురం గ్రామానికి చెందిన జి శ్రీనివాసరావు,బక్కుపేట గ్రామానికి చెందిన తేలు మోక్షిత గాయాలపాలయ్యారు. బాధితులకు స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ పావని వైద్యసేవలందించి మెరుగైన వైద్యం కోసం జిల్లాకేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.



పిచ్చికుక్క కాటుకు గురైన క్షతగాత్రులు

కొమరాడ విద్యార్థికి కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ ఎంపీసీ చదువుతున్న తెంటు హేమంత్ కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించాడు. గతేడాది డిసెంబర్ 21వ తేదీన హౌరాలో జరిగిన ఇంటర్నేషనల్ కిక్ బిక్సింగ్ 48 కిలోల విభాగంలో దేశం తరఫున తలపడి విజేతలగా నిలిచినట్టు పిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు.

కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు కళాశాల ఆవరణలో హేమంత్ ను గురువారం సత్కరించారు. క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.



హేమంత్‌ను అభినందిస్తున్న జూనియర్ కళాశాల పిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతిచెందిన శ్రీపతి అన్నపూర్ణ

విజయనగరం క్రైమ్: తన కుమార్తెకు దిష్టి తీసి ఆ దిష్టిని విసిరేస్తున్న క్రమంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టడంతో ఓ మహిళ శరీరమంతా కాలిపోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక మెయిన్‌రోడ్డు గాంధీనగర్‌లో శ్రీపతి అన్నపూర్ణ (33) మేడపైన అద్దెకు ఉంటున్నారు. డిసెంబరు 28న తన పదినెలల కుమార్తెకు దిష్టి తీసి, ఆ దిష్టిని విసిరే క్రమంలో పక్కనే ఉన్న హైటెన్షన్ వైర్లకు తగిలి విద్యుత్ షాక్ గురి కాగా శరీరమంతా కాలిపోయింది. వెంటనే ఆమెను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జనవరి 1న రాత్రి ఆమె మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒరిగిందేమీ లేదు

- పీఆర్‌టీయూ విమర్శ



పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలకు పైగా అయినా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల కోసం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ విచారం వెలబుచ్చారు. మంత్రివర్గ సమావేశం జరుగుతుందంటే ఏదో మేలు జరుగుతుందని ఆశతో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు ఎదురుచూడడం, సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు వారిని నిరాశపరచడం జరుగుతూనే ఉంటుంది. గత ప్రభుత్వంలో రావలసిన బకాయిలు లేవు. ఈ ప్రభుత్వంలో ఇవ్వాల్సిన డీఏలు ఐఆర్‌పీఆర్‌సీకి సంబంధించిన కమిషన్లు కూడా వేయలేదన్నారు. ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులకు ఏ ప్రభుత్వం వచ్చినా మేలు జరిగేది లేదనే పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని సూర్యనారాయణ విమర్శించారు. మూడు సంవత్సరాల నుంచి ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సరెండర్ లీవులు, పీఎఫ్, ఏపీజీఎల్‌ఐలు విడుదల చేయని పక్షంలో నూతన సంవత్సరంలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు నిరసన బాట పట్టక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మైనార్టీ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ

పార్వతీపురంటౌన్: మైనార్టీ యువతకు నైపుణ్య అభివృద్ధిలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఆర్‌ఎస్ జాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సొసైటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైస్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గల ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు తదితర మైనారిటీ వర్గాలకు చెందిన యువతకు ఆసక్తిగల రంగంలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత ఉద్యోగ, ఉపాధి కల్పించనున్నామన్నారు. శిక్షణ మూడు నెలలు ఉంటుందని, శిక్షణ కాలంలో వసతి, యూనిఫాం, భోజనం, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని తెలిపారు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు వారి విద్యార్హత, వయస్సు, ఆధార్, చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలతో బయోడేటాను విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో గల జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08922-230250/ 9490066050 / 9908667294 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.